[redacted] - 2 NOV 2020 ENADU

# ఘనంగా పుదుచ్చేరి విమోచన దినోత్సవం



విమోచన దినోత్సవంలో పోలీసుల కవాతు ప్రదర్శన

యానాం, న్యూస్‌టుడే: విద్య, వైద్య, పర్యాటక రంగాల్లో యానాం ప్రగతి పథంలో నడుస్తోందని, అనేక శాశ్వత ప్రాజెక్టులను సాధించానని ఆరోగ్యశాఖామంత్రి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. ఫ్రెంచ్ పాలనలో ఉన్న పుదుచ్చేరి దేశంలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని పుదుచ్చేరి విమోచన దినోత్సవాన్ని ఆదివారం స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించారు. ముఖ్యఅతిథి మల్లాడి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పరిపాలనాధికారి శివరాజ్‌మీనా, ఎస్పీ భక్తవత్సలన్, కమిషనర్ గుజ్జు గౌరీసరోజ, అధికారులు పాల్గొన్నారు.

# ఆ కుటుంబానికి కొండంత కష్టం..

## ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి



సవరపు నాగరాజు

యానాం, ముమ్మిడివరం: ఆ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందడంతో రెండో కుమారుడే ఇంటికి జీవనాధారం అయ్యాడు. ఆదివారం జరిగిన ఓ ప్రమాదంలో అతడు మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. ముమ్మిడివరం మండలం గేదెల్లంకకు చెందిన సవరపు శ్రీనివాసరావు, కృష్ణవేణిల పెద్ద కొడుకు చనిపోగా, రెండో కొడుకు సవరపు నాగరాజు(29) ఆటో నడుపుతూ, కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడు ద్విచక్రవాహనంపై యానాం వస్తుండగా ఎదుర్లంక వారధి వద్ద నాన్‌స్టాప్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. యానాం ట్రాఫిక్ ఎస్సై ఆల్ఫాన్స్‌రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నాగరాజుకు రెండేళ్ల క్రితం వివాహం కాగా, ఆరునెలల బాబు ఉన్నాడు.

యానాం: ఇసుక వ్యాపారానికి అనుమతులు ఇవ్వాలని వివిధ రంగాల కార్మికులు పరిపాలనాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

[redacted] ANDHRA JYOTHI - 2 NOV 2020

## ఆర్టీసీ బస్సు ఢీకొని

# యువకుడి మృతి



ముమ్మిడివరం, యానాం నవంబరు 1: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ముమ్మిడివరం మండలం గేదెల్లంక గ్రామానికి చెందిన సవరపు నాగరాజు(28) ఆదివారం బైక్‌పై యానాం బయలు దేరాడు. జీఎంసీ బాలయోగి వారధి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజుకు భార్య, ఆరు నెలల బాబు ఉన్నాడు. శ్రీనివాసరావు, కృష్ణవేణి దంపతుల పెద్ద కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. ఇప్పుడు చిన్న కుమారుడు కూడా మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నాగరాజు మృతితో ఆ కుటుంబానికి జీవనాధారం కరువైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ట్రాఫిక్ ఎస్ఐ ఆల్ఫాన్స్‌రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

[redacted] - 2 NOV 2020

ANDHRA JYOTHI

- NOV 2020

# పుదుచ్చేరి లిబరేషన్ వేడుకలు

## పతాకావిష్కరణ చేసిన మంత్రి మల్లాడి



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి మల్లాడి

యానాం, నవంబరు 1: యానాం నియోజకవర్గంలో పుదుచ్చేరి విమోచన దినోత్సవాన్ని (లిబరేషన్ డే) ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా ప్రాంగణంలో యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి శివరాజ్‌మీనా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మంత్రి మల్లాడి కృష్ణారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. శాంతి కపోతాలను, మువ్వన్నెల బెలూన్స్‌ను గాల్లోకి ఎగరవేశారు. అనంతరం వివిధ దళాధిపతులు, పుదుచ్చేరి పోలీసు, ఐఆర్‌బీ, హోంగార్డుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. వేడుక ప్రాంగణంలో వివిధ దళాధిపతులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వ్యాప్తి నివారణకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా జిప్‌మెర్ ఆసుపత్రి నిర్మాణ పనులు, ఆయుష్ ఆసుపత్రి మంజూరు, ఏఎన్ఎం, జీఎన్ఎమ్ కళాశాలకు నిధులు మంజూరు, సబ్‌సెంటర్ల ఆధునీకీకరణ చేపట్టినట్టు తెలిపారు. భారత ప్రభుత్వ ఇంజనీరిగ్ కళాశాల మంజూరు, గిరియాంపేట లోని జూనియర్ కళాశాలకు రక్షహరికృష్ణ పేరును ప్రతిపాదించడం, డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సుల ప్రారంభం తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా 'ఇదే నా చివరి జెండా ఆవిష్కరణ' అని మంత్రి మల్లాడి అన్న అంశం యానాంలో రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. కార్యక్రమంలో ఎస్పీ భక్తవత్సలన్, మున్సిపల్ కమిషనర్ గౌరీసరోజ, సీఐ గూటం శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

- 2 NOV 2020 SAKSHI

### ఘనంగా
## పుదుచ్చేరి విమోచన దినోత్సవం



విమోచన దినోత్సవంలో మంత్రి మల్లాడి తదితరులు

యానాం: పుదుచ్చేరి విమోచనా దినోత్సవాన్ని ఆదివారం యానాంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా ప్రాంగణంలో జరిగిన వేడుకలకు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అదే విధంగా శాంతి కపోతాలు, త్రివర్ణ బెలూన్‌లను ఆయన ఎగురవేశారు. అనంతరం వివిధ పోలీసు దళాలు నిర్వహించిన కవాతు ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది త్యాగ ఫలితంగా ఏర్పడిన పుదుచ్చేరి ప్రాంత అభివృద్ధి, ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ శివరాజ్‌మీనా, ఎస్పీ భక్తవత్సలన్, సీఐ గూటం శివగణేష్, మున్సిపల్ కమిషనర్ గుజ్జు గౌరీసరోజ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ

యానాం: నియోజకవర్గంలో ఇసుక కొరత నివారించి భవన నిర్మాణకార్మికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ షిరిడీ సాయి మేసన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యానాంలో ఇసుక లేకపోవడంతో దాని ప్రభావం ఉపాధి రంగాలపై పడుతోందన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి యానాంలో ఇసుక లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు, ఆర్‌ఏఓ శివరాజ్‌మీనాకు కార్మికులు వినతిపత్రం సమర్పించారు.

## నూతన దంపతులకు మంత్రి వేణు ఆశీర్వాదం



నూతనవధూవరులతో మంత్రి వేణు తదితరులు

యానాం: యానాంలో ఆదివారం రాత్రి ఓ వివాహానికి హాజరైన మంత్రి వేణు నూతన వధూవరులైన ప్రసాద్, స్వాతిలను ఆశీర్వదించారు. స్థానికుడు పిల్లి త్రిమూర్తులు తన కుమారుడు ప్రసాద్ వివాహానికి మంత్రిని ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో యానాం వచ్చిన మంత్రికి పలువురు స్వాగతం పలికారు. కార్యక్రమంలో శ్రీధర్, పంపన సూరిబాబు, నాగశంకర్ పాల్గొన్నారు.

### దళిత నేత
## కాశి కృష్ణ మృతికి సంతాపం

యానాం: యానాంకు చెందిన ప్రముఖ దళితనేత, అంబేడ్కర్ ఇంటర్నేషనల్ మిషన్(ఏఐఎం) వ్యవస్థాపకుడు, దళిత పాంథర్స్ వ్యవస్థాపకుడు ఉపాసక కాశి కృష్ణ మృతికి యానాం అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఆదివారం ఘన నివాళి అర్పించింది. స్థానిక బుద్ధా పార్క్ వద్ద జరిగిన కార్యక్రమంలో దళిత సాహిత్య అకాడమీ దక్షిణభారత అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తిరుకోటి నాగేశ్వరరావు, పండు సిద్ధార్థకుమార్, కోరుకొండ ప్రసాదరావు, కొల్లు నూకాంబరం, రఘు, నల్లా సూర్యప్రకాష్, సబ్బతి శ్రీను, లంక చినలోవరాజు, మధుర సుబ్రహ్మణ్యం, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



కాశి కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

## అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీకి ఆరు నెలల్లోపు జరగబోయే ఎన్నికలకు అధికార కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని పుదుచ్చేరి సీఎం నారాయణసామి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ కూటమిలోని అన్ని పార్టీలను వ్యూహాత్మకంగా కలుపుకొని ముందుకు వెళుతున్నట్టు తెలిపారు. ముఖ్యంగా ఎల్జీ కిరణ్‌బేడీ నుంచి ఆటంకాలు ఎదురైనా నాలుగు మేజర్ ప్రాజెక్టులు అమలు చేశామని ఆవిధంగా కరుణానిధి పథకం ద్వారా రూ.ఐదు లక్షల జీవిత బీమా, 1 నుంచి 12 తరగతుల విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్, 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం తదితర మైనవి అమలు చేసినట్టు చెప్పారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వయోపరిమితి 22 నుంచి 24 ఏళ్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి అనుమతి ఇచ్చినట్టు తెలిపారు.

2 NOV 2020 PRAJA SAKTHI

## సమస్యల పరిష్కారానికి ధర్నా



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - యానాం

సమస్యనలు పరిష్కరించాలంటూ యానాంలో భవన నిర్మాణ రంగ కార్మికులు ఆదివారం డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ర్యాలీని నిర్వహించారు. అనంతరం యూనియన్ నాయకులు పరిపాలనాధికారి శివరాజ్‌మీనాకు వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ ఇసుక పాలసీ, ఇసుక కొరత, కరోనా వల్ల భవన నిర్మాణ రంగ కార్మికులు ఉపాధిని కోల్పోయారన్నారు. యానాంలో సుమారు 3 వేల కుటుంబాలు ఉపాధి లేక అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. పోషణ కోసం అప్పులు చేసి నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమను ఆదుకోవాలని వినతిపత్రం అందించారు. తొలుత యానాంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం మంత్రి మల్లాడి కృష్ణారావుకు సమస్యలను వివరించారు. తమను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణరంగ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - యానాం

యానాం బాలయోగి వారధి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గేదెల్లంకు చెందిన సవరపు నాగరాజు(45) మరణించాడు. ముమ్మిడివరం మండలం గేదెల్లంకు చెందిన నాగరాజు బైకుపై వెళ్తుండగా కాకినాడ నుంచి అమలాపురం వైపుగా వెళ్తున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మరణించాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.